
## క్లుప్తంగా

### మహంకాళి అమ్మవారి ప్రతిష్ఠ వార్షికోత్సవాలు ప్రారంభం



**తాడేపల్లిరూరల్:** దుగ్గిరాల మండలం కంఠం రాజు కొండూరు గ్రామంలో గల మహంకాళి అమ్మవారి ప్రతిష్ఠ వార్షికోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి, ఆలయ అర్చకులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### మజ్జిగ పంపిణీ

**మంగళగిరి:** నగర పరిధిలోని యర్రబాలెం శివాలయం ఎదుట స్థానిక యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. యర్రబాలెంకు చెందిన లేళ్ల వీరకోట్లు కుమారుడు రుషిల్‌నందన్ జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం బాటసారులకు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుండాల సాయి, మక్కే కిరణ్, భీమవరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

### బైక్ దొంగ అరెస్ట్

**తాడేపల్లిరూరల్:** నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి సాయినగర్ ప్రాంతంలో నెల రోజుల కిందట రెండు ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయి. చోరీకి పాల్పడ్డ యువకుడిని తాడేపల్లి పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరిచారు. ఎస్ఐ వినోద్ తెలిపిన వివరాల ప్రకారం .. కృష్ణాజిల్లా మండూరుకు చెందిన బాదరబోయిన సాయికృష్ణ ఉండవల్లి సాయినగర్‌లో మేనత్త దగ్గర నివాసముంటూ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సాయికృష్ణకు అప్పులు ఉండడంతో వారి దగ్గర నుంచి ఒత్తిడి పెరిగింది. దీంతో ద్విచక్రవాహనాల అపహరణకు పాల్పడ్డాడు. సాయినగర్‌లో నివసించే నరేంద్ర, శ్రీనివాసరావులు తమ ద్విచక్రవాహనాలను ఇంటి ముందు పార్కింగ్ చేసుకున్నారు. అక్కడే నివాసముంటున్న సాయి మొదట ఒక బైక్‌లు దొంగిలించి స్వగ్రామానికి తీసుకు వెళ్లాడు. రెండో బండి కూడా తీసుకు వెళుతున్నాడు. ఆ సమయలలో ప్రకాశం బ్యారేజ్ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా బండి వదిలి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించాడు. అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ వినోద్ తెలిపారు.

### రైతుభరోసా కేంద్రాలు తనిఖీ



**ఫిరంగిపురం:** మండలంలోని నుదురుపాడు, మేరికపూడి గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను బుధవారం జిల్లా వ్యవసాయాధికారి ఎస్.వెంకటేశ్వర్లు తనిఖీచేశారు. రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రబీలో పండించిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని చెప్పారు. మొక్కజొన్న పండించిన రైతులు రైతుభరోసా కేంద్రాల్లో తమ పేరు నమోదు చేయించుకుంటే, కేటాయించిన తేదీల్లో మొక్కజొన్న సేకరిస్తారన్నారు. రబీ, ఖరీఫ్ పంటల సాగుపై సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. భూసారాన్ని పెంచేందుకు ప్రతిరైతు తమపంటపొలంలో పచ్చిరొట్టపైరు సాగుచేసి 30రోజుల తరువాత భూమిలో కలియదున్నాలని చెప్పారు. ఆయన వెంట ఏవో రమణకుమార్ ఉన్నారు.

### రూరల్ ఎస్ఐ బాధ్యతల స్వీకారం



**మంగళగిరి:** మంగళగిరి రూరల్ ఎస్ఐగా బి.జగన్మోహనరావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో రూరల్ ఎస్‌హెచ్ఓగా విధులు నిర్వర్తించిన బి విజయ్‌కుమార్‌రెడ్డి ఇటీవల వీఆర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో బి జగన్మోహనరావు రూరల్ ఎస్‌హెచ్ఓగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్‌హెచ్ఓగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, శాంతిభద్రలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తానని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### 14న శుభాంజలి ఆణిముత్యాలు

**పాత గుంటూరు:** అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈనెల 14న అందాల నటుడు శోభన్‌బాబు సూపర్‌హిట్స్ పేరున సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు శుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ్ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సంగీతాభిమానులు పాల్గొనాలని కోరారు.

# సంక్షేమ పాలనకు పెద్దపీట

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- మేడికొండూరులో గడప గడపకు మన ప్రభుత్వం



మేడికొండూరులో వృద్ధురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న కత్తెర సురేష్‌కుమార్

**మేడికొండూరు:** గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలోనే ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం మేడికొండూరు సచివాలయం-2 పరిధిలో నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు పొందుకున్న లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకానికి అర్హత ఉన్న ప్రతిఒక్కరూ పొందాలని సూచించారు. కులమతాలకు, పార్టీలకతీతంగా ప్రతి ఒక్క అన్నకు, చెల్లికి, ప్రతి అమ్మకూ, తండ్రికి పథకాలు అందించాలనేది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని అన్నారు. ఓదార్పు యాత్రలో రాష్ట్రం అంతా తిరిగి ప్రజా సమస్యలు స్వయంగా తెలుసుకుని, అన్ని తరగతుల వారికి అందేవిధంగా రూపొందించిన నవరత్నాల పథకాలు ఎంతో ప్రజలకు మేలు చేకూరుస్తున్నాయని అన్నారు. చరిత్రలో మిగిలిపోయే పథకాలు అమలు చేసిన ఘనత దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి తరువాత ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కులాలు, మతాలు ముఖమాఖాలు చూసి పథకాలు అందించిన తెలుగుదేశం పార్టీ నాయకుడు చంద్రబాబునాయుడు అధికార దాహంకోసం ప్రజలను మోసం చేసేందుకు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మవద్దని అన్నారు. దేశరాజకీయాలలోనే ఏ రాష్ట్రంలో అమలు కానని సంక్షేమ పథకాలు మనరాష్ట్రంలో అమలవుతుంటే కొందరు చూసి ఓర్వలేక మతి భ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఏకమై మరోమారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని, మరిన్ని సంక్షేమ పథకాలు పొందుకునేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బాజీ, బి.వి సుబ్బారెడ్డి, ఆవుల సంజీవరెడ్డి, రాజేంద్రప్రసాద్, పాములపాటి జయరావు, ఎంపీటీసీ సభ్యుడు కొలకలూరి నాగేశ్వరరావు, ముత్యాల బాలస్వామి, ఉడతా ప్రభాకర్, చంటి బాజి, రమేష్, ఆరీఫ్, వినోద్, బోడు చినసాంబయ్య, తలతోటి జవహర్, మిరయాల శివరామకృష్ణ, మన్నవ రాజేష్, నాగుల్ మీరా, మగ్బుల్, జానీ బాషా, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

**విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి**

**తాడికొండ:** వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. బుధవారం తాడికొండ అడ్డరోడ్డులో తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన కూలింగ్ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి ఎండల తాపం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో గ్రామాల్లో విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, తాడికొండ, నిడుముక్కల సర్పంచ్‌లు తోకల సరోజినీ, మాదాసు రత్నకుమారి, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, ముఖ్య నాయకులు తాళ్ల శివనాగరాజు, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి తోకల నరసింహారావు, నూకతోటి వెంకటేశ్వర్లు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమన్వయంతో పనిచేయండి

ఏపీ మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పి.అమ్మాజీ



సమావేశంలో ఏపీ మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పి.అమ్మాజీ

**తాడేపల్లిరూరల్ :** రాష్ట్ర వ్యాప్తంగా షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన వివిధ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేసి వారికి లబ్ధి చేకూరేవిధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని ఏపీ మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పి.అమ్మాజీ అన్నారు. తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సేవ సహకార సంస్థ కార్యాలయంలో రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా గౌరవ చైర్మన్ కొమ్మూరి కనకారావు, రెల్లి, ఇతరుల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ గౌరవ చైర్మన్ వడ్డాది మధుసూదనరావులు విచ్చేశారు. సమావేశంలో ఏపీ మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్.రవిబాబు, డైరెక్టర్ ఎస్.రవికుమార్, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సేవ సహకార సంస్థ, తాడేపల్లి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.చిన్నరాముడు, జనరల్ మేనేజర్ కె.సునీల్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఉండవల్లిలో చికిత్స శిబిరం

**తాడేపల్లిరూరల్:** నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి సెంటర్‌లో గురువారం నుంచి చికిత్సా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉండవల్లి సెంటర్‌లోని వంశీ టాలెంట్ స్కూల్ ఆవరణలో ఈనెల 16వ తేదీ వరకు ఆరు రోజులపాటు ఆక్యుప్రెజర్, మాగ్నటిక్, వైబ్రేషన్ థెరపి సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు అధికబరువు, రక్తపోటు, మోకాళ్ల నొప్పులు, బ్యాక్ పెయిన్, సయాటిక, తలనొప్పి, జాయింట్ పెయిన్, బ్రాంకైటిస్, నిద్రలేమి, కంటి కీళ్ల నొప్పులు, ఆస్తమా, ఈఎన్‌టీ, డయాబెటిస్, ఎసిడిటీ గర్భాశయ నొప్పి వంటి వాటికి చికిత్స నిర్వహిస్తారని, ఆరు రోజులకు రిజిస్ట్రేషన్ ఫీజు కేవలం రూ.200 మాత్రమేనని అన్నారు. మహిళలకు ప్రత్యేకంగా మహిళా థెరపిస్ట్ ద్వారా చికిత్స నిర్వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ట్రెజరర్ రామకృష్ణశెట్టి (9948074365), సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కొల్లి వెంకట చంద్రశేఖర్‌రెడ్డి (9966227141), జొన్నా రాజేష్ (9581837979)లను సంప్రదించాలని అన్నారు. ట్రీట్‌మెంట్‌ను డాక్టర్ సత్యనారాయణచౌదరి జోథ్‌పూర్(రాజ్), 9001659363, 7665525815, థెరపిస్ట్ జె.ఆర్.జిత్, జుయి చౌదరి సర్వీస్‌లను అందజేస్తారని తెలిపారు.

# బాధితునికి ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం



బాధితుడు తోట శ్రీనివాసరావుకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు

**మంగళగిరి:** నగర పరిధిలోని బేతపూడికి చెందిన తోట శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎంటీఎంసీ పరిధి బేతపూడికి చెందిన తోట శ్రీనివాసరావు ఇటీవల విద్యుదాఘాతానికి గురికావడంతో వైద్యులు కుడికాలును తొలగించారు. ఈ నేపథ్యంలో ఇంటి వద్దనే ఉండటంతో కుటుంబ పోషణ కష్టమైంది. స్థానిక వైఎస్సార్ పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే బుధవారం వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు సంకె సునీత, అనుబంధ సంఘాల నాయకులు ఎండీ ఫిరోజ్, ఆకురాతి రాజేష్, బేతపూడి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

**దివ్యాంగునికి ట్రైసైకిల్ అందజేత**

నగర పరిధిలోని ఓ దివ్యాంగ వృద్ధునికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ట్రై సైకిల్‌ను అందజేశారు. నగరానికి చెందిన షేక్ బాజీకి ఎవరూ లేకపోవడంతో కోర్టుల సమీపంలోని పలు దుకాణాల్లో పని చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తున్నాడు. బాజీ పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే బుధవారం పార్టీ నాయకుల చేతుల మీదుగా ట్రై సైకిల్‌ను అందజేశారు. ఎమ్మెల్యే ఆర్కేకు బాజీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు సంకె సునీత, ఎండీ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

**మట్టి ఖర్చులకు నగదు అందజేత**

నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాకలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి వైఎస్సార్ భీమా పథకం కింద మట్టి ఖర్చుల నిమిత్తం నగదును బుధవారం వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. పెనుమాకలో నివాసముండే భీమవరపు భరత్ (31) బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని త్వరతగతిన అందజేశామని, మిగతా సొమ్ము త్వరలోనే వారి కుటుంబ సభ్యుల ఖాతాలో జమచేయనున్నట్లు శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నియోజకవర్గ నాయకులు బొక్కా నాని, భుజంగరావు, బొక్కా వంశీ, వలంటీర్ పాల్గొన్నారు.

**తాడేపల్లిరూరల్:** దుగ్గిరాల మండల పరిధిలోని పలు బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్కే ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని ఆయా కుటుంబాలకు ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్) అందజేశారు. దుగ్గిరాల మండలం పెదకొండూరు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కొండూరు కిరణ్‌కుమార్ కుటుంబానికి రూ.20 వేలు, ఎస్సీ కాలనీకి చెందిన నిరుపేద వృద్ధురాలు కె.మరియ రోజమ్మ పక్షవాతానికి గురికాగా రూ.10 వేలు, దివ్యాంగురాలు కొండూరు జ్యోజి రాణికి రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండూరు శేషయ్య, కిషోర్, సుద్దపల్లి సుందరరావు, కిరణ్, నాని తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు

**గుంటూరు ఈస్ట్:** విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డీ-13 సెక్షన్‌లో అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ వివరాలను విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీనివాసబాబు బుధవారం వెల్లడించారు. 56 మంది అధికారులు, 168 మంది సిబ్బంది 56 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. 4,808 సర్వీసులు తనిఖీ చేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 370 మందికి రూ.19.7 లక్షలు అపరాధ రుసుము విధించారు. విద్యుత్ మీటర్లకు సీలు తప్పనిసరిగా ఉండాలని, సీలు లేకున్నా.. తుప్పుపట్టి ఊడినా వెంటనే అధికారులకు రాతపూర్వకంగా తెలియజేయాలని సూచిచారు. మీటర్లకు సీలు లేకపోతే విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. విద్యుత్ చౌర్యం చేస్తూ దొరికితే అపరాధరుసుం విధిస్తామని, రెండోసారి అదేతప్పు చేస్తే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని స్పష్టం చేశారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను 9440812263, 9440812360 నంబర్లకు నేరుగా, వాట్సాప్ ద్వారా చేయవచ్చని వివరించారు. తనిఖీల్లో డీఈఈ ఎం.రవికుమార్, పి.హెచ్.ఖాన్, ఏఈలు కె.కోటేశ్వరరావు, వి.బాజీ పాల్గొన్నారు.

# ఇంటర్ టాపర్‌కి రూ.15వేలు నగదు బహుమతి



విద్యార్థిని అలేఖ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

**మంగళగిరి:** ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని పులి అలేఖ్యను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు రూ.15వేల ప్రోత్సాహక నగదు బహుమతి అందజేసి అభినందనలు తెలిపారు. నగరంలోని బాప్టిస్టుపేటకు చెందిన పులి అలేఖ్య ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షా ఫలితాల్లో 440 మార్కులకుగాను 429 సాధించింది. నిరుపేద కుటుంబంలో జన్మించిన అలేఖ్య ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించడం పట్ల అభినందనలు తెలుపుతూ ఎమ్మెల్యే ఆర్కే రూ.10వేల ప్రోత్సాహక నగదు బహుమతిని బుధవారం పార్టీ నాయకుల చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు విద్యార్థిని అలేఖ్యకు సత్కరించి రూ.5వేల నగదు అందజేశారు. ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేసిన ఎమ్మెల్యే ఆర్కేకు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుకు అలేఖ్యతోపాటు ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ మహిళా కన్వీనర్ సంకె సునీత, అనుబంధ సంఘాల నాయకులు ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# సీబీఐ కొత్త పథకం సెంట్ సురక్షిత్- సమృద్ధి

**నగరంపాలెం:** ఖాతాదారుల సౌకర్యార్థం 'సెంట్ సురక్షిత్- సమృద్ధి పేరుతో సరికొత్త రికరింగ్ డిపాజిట్ స్కీంను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సీబీఐ) రీజినల్ మేనేజర్ శ్రీజయ్‌మండపే తెలిపారు. గుంటూరు రీజినల్ కార్యాలయంలో బుధవారం ఆ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నుంచి 50 ఏళ్ల వయసు, సంపాదనాపరులైన వారు పథకానికి అర్హులని పేర్కొన్నారు. పొదుపు కింద నెలకు కనీసం ఇన్‌స్టాల్‌మెంట్ రూ.10 వేల నుంచి ఒక లక్ష వరకు ఉంటుందని, కాలపరిమితి 84 నెలలు లేదా ఏడేళ్ల వ్యవధి అని, మెచ్యూరిటీ మొత్తం జమ చేసిన అసలు+ వడ్డీ ఉంటుందని పేర్కొన్నారు.

# రేపు తాడికొండలో జాబ్‌మేళా

ఇన్‌చార్జి ఎంపీడీఓ బిక్కి మహేష్‌బాబు



జాబ్‌మేళా బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో మహేష్‌బాబు, సిబ్బంది

**తాడికొండ:** తాడికొండ బీఎస్ఎస్‌బీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించే జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని తాడికొండ ఇన్‌చార్జి ఎంపీడీవో బిక్కి మహేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో బ్రోచర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ, డీఆర్‌డీఏ, జిల్లా ఉపాధి కార్యాలయం ద్వారా ఈ జాబ్ మేళాను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15 బహుళ జాతీయ, ఇతర కంపెనీలు ఈ మేళాలో పాల్గొననున్నాయని, 10వ తరగతి నుంచి బీటెక్ విద్యార్హత వరకు కలిగిన యువతీ యువకులకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనం ఇస్తారని, యువత ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

# మానసిక వైద్యుల సేవలు ప్రశంసనీయం



రోగిని పరామర్శిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి చంద్రమౌళేశ్వరి

**గుంటూరు మెడికల్:** మానసికంగా ఇబ్బందులు పడుతున్న వారికి వైద్య సేవలు అందించాలన్న దృక్పథంతో వైద్యులు ఈ విభాగాన్ని ఎంపిక చేసుకోవడం అభినందనీయమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమౌళీశ్వరి అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా బుధవారం గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగాన్ని ఆమె సందర్శించారు. రోగులకు అందుతున్న సేవల గురించి ఆ విభాగం వైద్యులతో సమీక్షించారు. మానసిక వ్యాధిగ్రస్తులతో మాట్లాడినప్పుడు వైద్య సేవలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. మానసిక సమస్యలకు వైద్యులు వైద్య సేవలు చేయడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ప్రస్తుతం వైద్య వృత్తిలో డబ్బులు సంపాదించాలన్న ఆలోచన ఎక్కువైందని వివరించారు. మానసిక వైద్య విభాగాన్ని వైద్యులు ఎంపిక చేసుకోవడం చాలా అరుదుగా కనిపిస్తోందన్నారు. మహిళా వైద్యులు కూడా ఈ విభాగాన్ని ఎంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. మానసిక రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు న్యాయ పరమైన సమస్యలు ఉంటే ఆస్పత్రిలోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయి కిరణ్, మాజీ అదనపు పిపి కట్టా కాళిదాసు, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ నిమిషా, డాక్టర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# హనుమత్ జయంత్యుత్సవాలు

**పాత గుంటూరు:** పాత గుంటూరులోని విశాఖ శారదా పీఠ పరిపాలిత వీరాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం హనుమత్ జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రభాత సేవ, ఆలయ ప్రదక్షిణలు, ఆకు పూజలు, తీర్థ గోష్ఠి, ప్రసాద వినియోగం జరిగింది. వీరాంజనేయ స్వామికి 108 కలశాలతో మహాస్నపన అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అధ్యక్షులు కొప్పు రావూరి బాబురావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రంధి కోటేశ్వరరావు, ఆత్మకూరి లక్ష్మణరావు, చీమకుర్తి తాండవ నాగ మల్లేశ్వరరావు, కాసుల వెంకట శివ ప్రసాద్, నాగం రామారావు పాల్గొన్నారు.

### అనూషకు డాక్టరేట్

**ఏఎన్‌యూ:** ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ పరిశోధకురాలు నూతక్కి అనూషకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. ఫార్మసీ పరిశోధనా పర్యవేక్షకుడు డాక్టర్ పి.రవి పర్యవేక్షణలో 'ఫైటోకెమికల్ స్క్రీనింగ్ అండ్ బయలాజికల్ ఎవల్యూషన్ ఆఫ్ డిఫరెంట్ ఎక్స్‌ట్రాక్ట్స్ ఆఫ్ ఆండ్రోగ్రాఫిస్ ఎకియాడ్స్, కొమ్మికార్పస్ చైనెసిస్ అండ్ టాలినమ్ పోర్ట్యులేసిఫోలియం' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని వివరించారు.

### కుట్టు మిషన్లు పంపిణీ

**గుంటూరు మెడికల్:** సుష్మగౌడ్ 24వ జయంతి సందర్భంగా స్థానిక పట్నంబజారులోని సుష్మగౌడ్ ఫౌండేషన్ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు జల్లెడ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన బుధవారం ముగ్గురు పేద వితంతువులకు కుట్టు మిషన్లు అందజేశారు.

# జయ'జైన్' ధ్వానాలు





విద్యానగర్ 3వ లైన్‌లో కొత్తగా నిర్మించిన జైన్ గుడి ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలోభాగంగా బుధవారం భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రింగ్ రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో జైన్ సంప్రదాయం ప్రకారం.. విశేష కార్యక్రమాలు నిర్వహించారు. జైన్ గురు మణి ప్రభ్ సూరీజీ గురువారం ఉదయం జరిగే గుడి ప్రతిష్ఠ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సుక్కిరాజ హుండియా, అశోక్ హుండియా, మహేంద్ర గులేచా, జుగ్రాజ్ భండారి, జైన్‌లు పాల్గొన్నారు. జైనుల జయజయధ్వానాలతో ఆ ప్రాంతం మార్మోగింది.

- పాత గుంటూరు